నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## చిత్తూరు | తిరుపతి

ఆదివారం | 30 జూన్ 2024 | పేజీలు 9


## గరుడపై సుందరరాజస్వామి అభయం

### ముగిసిన అవతార మహోత్సవాలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుచానూరు సుందరరాజ స్వామివారు శనివారం రాత్రి గరుడ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు అభయమిచ్చారు. ఆలయంలో మూడు రోజులు జరిగిన శ్రీసుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామివారి ముఖ మండపంలో శ్రీసుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ స్వామివారి ముఖమండపంలో ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుభాష్, గణేష్, ఏవిఎస్‌ఓ సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఈవీఎం, వీవీప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్, వీవీప్యాట్ గోదాము భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం చిత్తూరు కలెక్టరేట్‌లోనిఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతకు చేసిన ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటి కప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను క్షుణ్ణంగా తనిఖీ చేసిసమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలకోసారి రాజకీయ పార్టీల ప్రతినిధులసమక్షంలో తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాంను త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలించినట్లు వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తతతో వుండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాంతనిఖీ ప్రక్రియలో డీఆర్‌ఓ బి.పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇండియన్ నేషనల్‌కాంగ్రెస్ పరదేశి, టీడీపీ సురేంద్రకుమార్, బీజేపీ శ్రీనివాసులు, వైయస్‌ఆర్సీపీ ఉదయ్‌కుమార్, సీపీఎం గంగరాజు, ఎలక్షన్స్‌సెల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## కరెంటు మీటర్ల దళారి, సూత్రధారి

# ఆర్ఐ భాస్కర్..!




**ఒక్కోమీటర్‌కు రూ.50 వేలు వసూలు..!**

**డబ్బులు ఇవ్వలేదని 200 అప్లికేషన్లు శ్రీకాళహస్తి తహసీల్దార్ ఆఫీస్‌లో పెండింగ్..!**

**కలెక్టర్ గారు స్పందించండి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్ నగర్ ఇంటి పట్టాలు. కరెంటు మీటర్లు బోగోతంలో ఆర్ఐ భాస్కర్ కీలక పాత్ర పోషించారు. ఇతను గత పరిపాలనలో ఆడింది ఆట.. పాడింది పాట. కరెంటు మీటరు రూ.50వేలు డబ్బులు ఇవ్వకపోతే అప్లికేషన్ పక్కన పడేస్తాడు. ఈ విధంగా నిరుపేదలైన రాజీవ్‌నగర్‌లో ఇంటి స్థలాలు లబ్ధిదారులు 200 మంది దాకా ఉన్నారు. గత పరిపాలనలో ఇచ్చిన ప్రతి ఇంటి పట్టాకు కరెంటు మీటరు ఇతను సంతకం చేసి ఇస్తేనే ఎమ్మార్వో సర్టిఫికేట్ ఇస్తారు. ఈ విధంగా పిచ్చటూర్ రోడ్డుకు ఇరువైపులా రాజీవ్ నగర్ లోపల కరెంటు మీటర్లు ఇచ్చి లక్షల రూపాయలు దండుకున్నాడు. ఇతను వ్యవహార శైలి వలన అమాయకులైన లబ్ధిదారులు లక్షల రూపాయలు నష్టపోవాల్సి వచ్చింది. ఆర్ఐ భాస్కర్ చెరువులు, గుంటలు రోడ్డు పోరంబోకు భూములలో కూడా అక్రమంగా నిర్మించిన ఇళ్లకు కరెంటు మీటర్లు ఇవ్వడం జరిగింది. దీని ఫలితంగా దాదాపు 200 ఇల్లులు సదురు ఆర్ఐ రోడ్డు పోరంబోకు అని జెసిబిలతో కూల్చివేయడం జరిగింది. శ్రీకాళహస్తి ఆర్ఐ భాస్కర్ పై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ జరిపితే చాలా విషయాలు తెలుగులోకి వస్తాయి. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి భాస్కర్‌పై సమగ్ర విచారణ జరిపి అతని పై చర్య తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అదే విధంగా కరెంటు మీటర్లకు డబ్బులు దండుకొని




మిగతా 2లో

# మాను మాయం...ముప్పు ఖాయం..

**వందేళ్ళ చెట్టు ఒక్క నిమిషంలో కూల్చివేత**

**తరుగుతున్న వృక్ష సంపద**

**పర్యావరణానికి తూట్లు**

ఎప్పుడో ఎవరు నాటారో తెలియదు.... పెరిగి పెద్దదై నిడనీస్తోంది.... ఆ నీడన మనుసులు, జంతువులు వేసవిలో సేద తీరుతున్నాయి. కొందరు స్వార్థపరులు నిలువునా నరికి, తరలించి ధనార్జన చేసుకుంటున్నాను. ఫలితంగా పర్యావరణ దెబ్బ తినడంతో పాటు భూతాపం పెరిగి వర్షాలు కరువవుతున్నాయి. ఇలాగే జరిగితే మానవ. మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. మన పూర్వీకులు నాటిన పచ్చని చెట్లను అధికారులు వెచ్చించలేక పోతున్నారు.

**చంద్రగిరి, న్యూస్:** రెవెన్యూ, అటవీ, పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పచ్చని చెట్లను కొంతమంది స్వార్థపరులు కూల్చివేసి కలపగా మార్చి తరలిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి టన్నుల కొద్దీ కలప అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. కలప అక్రమ రవాణాపై అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించకుండా చేతులెత్తేశారు. దీంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. అందినంత చెట్లను కూల్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అడిగే వారే కరువవ్వడంతో ఇష్టారాజ్యంగా అక్రమార్కులు రోడ్డు పక్కన ఉన్న చెట్లను సైతం కూల్చి వేస్తున్నారు. కనుమరుగవుతున్న వృక్ష సంపద కలప వ్యాపారులు రైతుల పొలాల్లో ఉన్న చెట్లను కొనుగోలు చేసి రాత్రికి రాత్రే వాటిని కూల్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆదివారం అయితే అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో ధైర్యంగా రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ చెట్లు నరికేసి సొమ్ము చేసుకుంటున్నారు. చింత, వేప, కానుగ, టేకు చెట్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. గృహోపకరణాల కోసం వీటిని యథాస్వేచ్ఛగా నరికేస్తున్నారు. ఇటుకల తయారీ, హోటల్లో వంటకాల తయారీ



కోసం తరలిస్తున్నారు. చంద్రగిరి నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో అక్రమార్కులు చెట్లనునరికి కలపను యధాశక్తిగా అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రతిరోజు కలప అక్రమ రవాణా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్న పట్టించుకోని అధికారులు కరువయ్యారు. అక్రమార్కులు లారీలలో ఈ కలపను చెక్ పోస్టులు లేని రహదారిలో తరలిస్తుండడంతో వ్యాపారం సవ్యంగా సాగుతుంది. పచ్చని చెట్లను పరిరక్షించి భూగర్భజలాలు అందించేందుకు ప్రభుత్వం వాల్టాచట్టాన్ని అమలు చేస్తుంది. అక్రమంగా చెట్లను నరికిన అనుమతి లేకుండా బోర్డులు వేసిన చట్టం ప్రకారం నేరం. పోలీసులు, రెవెన్యూ, అటవీ శాఖ

మిగతా 2లో

## తిరుపతిని టెంపుల్ సిటీగా ప్రకటించాలి

ప్రముఖ సినీ నటుడు సుమన్



వివరాలు 8లో

## దళారీ వ్యవస్థ నియంత్రణకు ఆన్లైన్ ఆధార్ అనుసంధానం

అధికారుల సమీక్షలో ఈఓ జె.శ్యామలరావు

8లో

## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ మణికంఠ చందోలు



వివరాలు 8లో

## గోపాలకృష్ణ పురం పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని గోపాలకృష్ణ పురం ఎంపీపీ పాఠశాలలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి వాసన్ ఐ కేర్ ఆసుపత్రి, నారాయణాద్రి, హాస్పిటల్, ఆపిల్ ఇంటరనేషనల్ డెంటల్ కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిభిరం నిర్వహించబడునని డిఈఓ శేఖర్, డివైఈఓ ప్రభాకర్ రాజు, ఎంఈఓ బాలసుబ్రమణ్యంలు తెలిపారు. ఈ వైద్య శిభిరంను ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించి గుండె, కంటి, పంటి సమస్యలు పరీక్షించి వైద్య సేవలు అందిస్తారని, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఈ వైద్య శిభిరంకు వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్య కార్డులు తీసుకుని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కోనేటి రవి రాజు, అధ్యక్షులు బాబు, ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, కోశాధికారి లోక నాథ నాయుడు, ఉప కార్యదర్శి రామేష్ రాజులు పాల్గొంటారని తెలిపారు.

## విద్యాభివృద్ధికి చేయూత నందిస్తా : పురుషోత్తం రెడ్డి

**వాకాడు, మేజర్‌న్యూస్:** పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు చేయూత అందించేందుకు తాను వ్యక్తిగతంగా సిద్దంగా ఉన్నానని బీజేపీ గూడూరు నియోజకవర్గ కన్వీనర్, జమీన్ కొత్తపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి అన్నారు



శనివారం ఉదయం మండల పరిధిలోని జమీన్ కొత్తపాలెం పంచాయితీ పరిధిలోని గంగన్న పాలెం గ్రామంలో గంగన్నపాలెం యూత్ ఆర్థిక సౌజన్యముతో గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు విద్యాసామాగ్రిని పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ రోజు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నా గ్రామానికి చెందిన యువత సహృదయంతో విద్యాభివృద్ధికి వారు చేయూత అందించడం ప్రశంసనీయం, ఎల్లవేళలా నా సహాయ సకారాలు ఉంటాయన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు పురుషోత్తం రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నజీబ్ భాష,,స్థానిక ఉపాధ్యాయులు, గంగన్న పాలెం యువత కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బెస్త కులస్తులను ఆదుకోవాలి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** గత వైసిపి ప్రభుత్వంలో బెస్త కులస్తుల నిధులు దుర్వినియోగ మయ్యాయని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బెస్ట్ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మంత్రి కొల్లు రవీంద్రకు టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భక్త వత్సలం కోరారు.



ఈ మేరకు శనివారం మచిలీపట్నం మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. బెస్తకులస్తుల సమస్యలను మంత్రికి వివరించారు. బెస్ట్ కులస్తుల నిధులపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుల్లయప్ప, భూసార క్షత్రియసంఘం సభ్యులు వాసుదేవరావు పాల్గొన్నారు.

## మన గ్రోమోర్‌లో నూతన నానో డీఏపీ ప్రారంభం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, మన గ్రోమార్ శ్రీకాళహస్తిలో నూతన ఉత్పాదకత మీట నానో డిఏపి శనివారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంరో నాగభూషణం రెడ్డి. మేనేజర్ ఎస్ బాబు. ఫీల్డ్ ఆఫీసర్ ముని బాబు. ముని రాజా. రైతులు పాల్గొన్నారు.



## కరెంట్ మీటర్ల దళారి, సూత్రధారి ఆర్ఐ భాస్కర్.!

(మొదటిపేజీ తరువాయి)

పొట్ట నింపుకున్న భాస్కర్ దగ్గర డబ్బులు వసూలు చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరుతున్నారు. లబ్ధిదారుడు డబ్బులు ఇవ్వకపోతే ఇతనే విద్యుత్తు ఏఈకి ఫోన్ చేసి మీటర్ ఇవ్వవద్దు అని చెప్తాడు. ఇదే కరెంటు ఏఈ శ్రీకాళహస్తి ఆర్ఐ భాస్కర్ ఇద్దరూ కలిసి కరెంటు మీటర్ల రోడ్డు పోరంబోకు. కాల్వపురం బోకు. చెరువు భూములలో మీటర్లు ఇచ్చి డబ్బులు దండుకున్నారు. ఇది జగమెరిగిన సత్యం ఇప్పటికైనా శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే విచారణ జరిపి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు కోరుతున్నారు. గత పాలకులు ఇచ్చిన పట్టాలు ఇతను దగ్గరుండి లబ్ధిదారులకు కరెంటు మీటర్లు ఇప్పించాడు. లక్షల రూపాయలు దండుకున్నాడు దీని ఫలితంగా విద్యుత్తు అధికారులు కూడా రోడ్డు పోరంబోకులో కరెంట్ మీటర్ల ఇచ్చి వసూళ్ల కార్యక్రమం మొదలు పెట్టారు. ఆర్ఐ భాస్కర్ పై సమగ్రమైన విచారణ జరిపి సస్పెండ్ చేయాలని పిచ్చా టూరు రోడ్డు ఇరువైపులా లబ్ధిదారులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యేని. జిల్లా కలెక్టర్‌ని కలిసి వారి బాధలు చెప్పు కోవడానికి సిద్ధమవుతున్నారు.

శ్రీకాళహస్తి రెవిన్యూ ఆఫీసులో జరిగే అక్రమాలు వసూళ్లు కార్యక్రమాలు కడప జిల్లా పులి వెందులలో కూడా జరగలేదని శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. కరెంట్ మీటర్లు విద్యుత్ అధికారులు ఇవ్వాలా రెవెన్యూ అధికారులు ఇవ్వాలా అని శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని. ఈ ప్రభుత్వంలో నైనా నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు అందాలని శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

## మాను మాయం...ముప్పు ఖాయం..

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వాల్టా చట్టం అటకెక్కింది. ఇకనైన ప్రభుత్వ అధికారులు స్పందించి అరుదైన వృక్ష సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

**ఎర్రచందనంలా కాపాడాలి....** అరుదైన వృక్ష సంపద శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం చెరట్లను నరకకుండా పోలీసు అటవీ టాస్క్ ఫోర్స్ అధికారులు ఎలా సంరక్షిస్తున్నారో, అలాగే వృక్ష సంపదను కూడా సంరక్షించాలి. అక్రమ రవాణా కాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. పర్యావరణ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండడంతో అటవీ వృక్ష సంపదను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎర్రచందనం చెట్లను ఏ విధంగా కాపాడుతున్నారో ఆ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వృక్ష సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

**అడ్డు అదుపు లేదు....** చంద్రగిరి నుంచి ప్రతిరోజు ట్రాక్టర్లలో కలప అక్రమ రవాణా సాగుతుంది. అధికారులు గత ఆరు నెలలుగా ఎన్నికల హడావుడి పడిపోవడంతో ఈ అక్రమ రవాణా ఊపందుకుంది. అక్రమార్కులు అడ్డు అదుపు లేకుండా చెట్లను నరికివేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

### వృక్షాలను కాపాడాలి – వనమ్మ, గ్రామస్థులు

అడవిలో ఎర్రచందనం చెట్లను ఏ విధంగా కాపాడుతున్నారో చెట్లను నరికి వారి నుంచి కాపాడాలి. లేకపోతే మానవ మనుగడ లేకుండా పోతుంది. ఇప్పటికే వర్షాలు కురవక భూగర్భ జలాలు అడుగంటాయి. అధికారులు ఇంకా నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదు.



## విద్యార్థి, రైతు ఉద్యమం బలోపేతంతోనే అంజన్, గగన్‌కు నివాళి

### సంస్మరణ సభలో వక్తలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** దేశంలో విద్యార్థులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం బలమైన ఉద్యమం సాగించినప్పుడే అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్‌లకు నివాళి అర్పించినట్లు అవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం సెనెట్ హాల్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు అతుల్‌కుమార్‌అంజన్, ఏఐఎస్ఎఫ్ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు గగన్ దీప్ సింగ్ సంస్మరణ సభ జరిగింది. అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ లక్నో యూనివర్సిటీలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి విద్యార్థి సంఘం ఎన్నికలలో ఆరు సంవత్సరాలు ఏఐఎస్ఎఫ్ నుండి యూనివర్సిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారని చెప్పారు. విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషిచేసి జాతీయ అధ్యక్షులుగా పని చేశారని చెప్పారు. అనంతరం రైతు సంఘంలో బాధ్యతలు తీసుకొని రైతాంగ సమస్యల సాధన కోసం కృషి చేశారని అన్నారు. నేడు దేశంలో విద్యా వ్యవస్థ నాశనం అవుతుందని అందుకు నీట్ ప్రశ్నాపత్రం లీకేజీనే ఉదాహరణ



అన్నారు. దీనిపై ప్రధాని నోరు మెదపక పోవడం శోచనీయమన్నారు. విద్య కాషాయీకరణ జరుగుతోందని విద్యార్థి లోకం ఇలాంటి ఘటనలపై పోరాటం సాగించాలని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన రైతాంగ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని, ఈ పోరాటం వెనుక అతుల్ కుమార్ అంజన్ కృషి ఎనలేనిదన్నారు. ఐదు భాషలలో అనర్గళంగా మాట్లాడగలిగిన గొప్ప నాయకుడు అంజన్ అని కొనియాడారు. తుది శ్వాస విడిచే వరకు రైతుసమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తూనే ఉన్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాజస్థాన్ అధ్యక్షుడు గగన్ దీప్ సింగ్‌ను సంఘ విద్రోహ శక్తులు హతమార్చాయన్నారు. అతని మరణం విద్యార్థి ఉద్యమానికి తీరనిలోటన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు రామకృష్ణ పాండా మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం ఇదే యూనివర్సిటీలో జరిగిన సెమినార్‌లో అతుల్‌కుమార్ అంజన్ పాల్గొన్నారని, నేడు ఇదే వేదికపై నుండి ఆయన సంస్మరణ సభ నిర్వహించాల్సి రావడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య మాట్లాడుతూ నాడు స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య నేడు విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం అలుపెరగని పోరాటం సాగిస్తోందన్నారు. ఇలాంటి నేపథ్యంలో సహించలేని అసాంఘిక శక్తులు గగన్ దీప్ సింగ్ ను హతమార్చడం సిగ్గుచేటు అన్నారు. వివిధ సమస్యలపై పోరాటం సాగించిన అతుల్ కుమార్ అంజన్ నాలుగు సంవత్స రాల తొమ్మిది నెలలపాటు జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగ రాజన్ మాట్లాడుతూ అతుల్ కుమార్ అంజన్, గగన్ దీప్ సింగ్‌ల పోరాట పటిమ, స్ఫూర్తిని తీసుకొని విద్యార్థులకు ఎదుర్కొం టున్న సమస్యలపై పోరాడి సాధించి వారికి నిజమైన నివాళి అర్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సంఘమిత్ర , అమీన్ హంజా, మహేష్ కుంజం, జాతీయ కార్యద ర్శులు కబీర్, షాహిద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, ఉపాధ్యక్షులు బండి చలపతి, నాశర్జీ, ఫణీద్ర, ఉదయ్ కుమార్, జిల్లా అధ్యక్షు, కార్యదర్శి లు నవీన్, ప్రవీణ్, యూనివర్సిటీ నాయకులు చిన్న, చంద్ర నాయక్ పాల్గొన్నారు.

## భారత్ క్రికెట్ టీంకు ఆల్ ద బెస్ట్

**గూడూరు, మేజర్‌న్యూస్:** ఆదిశంకర పాఠశాల విద్యార్థులు భారత్ జట్టు సౌత్ ఆఫ్రికా జట్టుతో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఉదయం పాఠశాల విద్యార్థులు ఆల్ ద బెస్ట్ ఆకారంలో ఏర్పడి భారత్ జట్టు టి20 ప్రపంచ కప్‌ను గెలవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ శనివారం జరిగే టి20 ప్రపంచ కప్ ఫైనల్లో సౌత్ ఆఫ్రికాపై భారతదేశం గెలిచి భారతదేశం త్రివర్ణ పతాకం ప్రపంచ పటం పై మరోసారి ఎగరాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరూ భారత్ క్రికెట్ టీంకు ఆల్ ద బెస్ట్ తెలియజేశారు. భారత ఆటగాళ్లందరూ బాగా ఆడి భారతదేశానికి టి20 ప్రపంచ కప్ తీసుకురావాలని 140 కోట్ల భారతీయుల కలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, ప్రశాంత్ , పాఠశాల పీఈటి మనోహర్ విద్యార్థులు పాల్గొన్నారు.



## జూలై 1న ఇంటి వద్దకే పింఛన్

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై 1న సామాజిక పింఛన్‌ను లబ్ది దారుల ఇంటి వద్దే ఇస్తామని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. పింఛన్ 3 వేల రూపాయల నుండి 4వేల రూపాయలును పెంచిన పెన్షన్ మొత్తంతో పాటు ఏప్రిల్, మే మరియు జూన్ నెల అరియర్ మొత్తము కలిపి 7 వేల రూపాయలు పెన్షన్ దారులకు సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణి చేయమని ఆదేశాలు జారీ చేసి వున్నారని తెలిపారు. అందులో భాగంగా శనివారం కమిషనర్ సచివాలయం, పురపాలక సిబ్బందితో పెన్షన్ల పంపిణీసమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.



## మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దాం

### గువ్వల రమేష్ రెడ్డి పిలుపు... టీడీపీ జెండా ఆవిష్కరణకు శ్రీకారం

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రాంప్రసాద్ రెడ్డి జులై 5న చౌడేపల్లి పర్యటనకు రానున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి(చిట్టి) తెలియజేశారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో ఆయన ప్రసంగిస్తూ చౌడేపల్లి బస్టాండ్ నందు తెలుగుదేశం పార్టీ జండా ఆవిష్కరణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మాదిరాజు ప్రదీప్ రాజు, లక్ష్మీపతి రాజు, ఆవుల రామచంద్రయ్య , శ్రీధర్ రాజు (గిరి) ,వేలూరు సుబ్రహ్మణ్యం ,పంజాని పల్లి బాబు నాయుడు, రెడ్డి ప్రసాద్, హరి, కార్తీక్, పవన్, రాజేష్, ప్రభాకర్ మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ

**ఎస్ఆర్.పురం, మేజర్‌న్యూస్:** ఎస్ఆర్ పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామంలో గత ఆరు రోజులుగా స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమం ఇండియన్ బ్యాంకు వారి ద్వారా ఏర్పాటు చేయబడిన జనరల్ ఈడిపి (వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమం) శనివారంతో ముగిసినది ఈ కార్యక్రమం ద్వారా వ్యవస్థాపక అభివృద్ధి మరియు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ పైన అవగాహన కల్పించి శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ ప్రేమ్ సాగర్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ ఫ్యాకల్టీ వసంత కుమార్ ఎన్జీవో కు సంబంధించిన కృష్ణయ్య భూపతి పాల్గొనడం జరిగింది.



## నిడిగుర్తి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మండలం నిడిగుర్తిలో గ్రామములో శనివారం తాసిల్దార్ నరసింహారావు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. వాకాడు తాహిసిల్దార్ నరసింహారావు మాట్లాడుతూ పౌర హక్కుల గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చట్టాలను తెలుసుకోవాలన్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను స్వేచ్ఛ, హక్కులు ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాలలో బలహీనవర్గాలు భయభ్రాంతులకు కలగకుండా హక్కులను చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని స్త్రీలకు ప్రత్యేకత స్థానం ఉందని ఆ హక్కులను సమానంగా చట్టాల ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఎవరిని ఎవరు విమర్శించు కోవద్దన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సెల్వ రాజ్, వీఆర్వో యాదవయ్య, అంగన్వాడి సూపర్వైజర్ కవిత, మాజీ సర్పంచ్ సంపత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రాజీయే ... రాజ మార్గం

**ప్రిన్సిపల్ సివిల్ న్యాయ మూర్తి సులోచనా రాణి**

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:**
చట్ట ప్రకారం రాజీ చేసుకోగలిగిన కేసులన్నింటినీ మెగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందని ప్రిన్సిపల్ సివిల్ న్యాయమూర్తి సులోచనా రాణి తెలిపారు. గూడూరు పట్టణంలోని కోర్టు భవన సముదాయ ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ అద్వర్యంలో మెగా లోక్ అదాలత్ జరిగింది.గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్టు భవన సముదాయ ప్రాంగణంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ అద్వర్యంలో మెగాలోక్ అదాలత్ నిర్వహించారు .ఈ లోక్ అదాలత్ లో పలు కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో న్యాయమూర్తి సులోచనా రాణి మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్ ద్వారా అనేక రకాల కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. తద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతోందని తెలిపారు. ఇది గుర్తించి లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వీలైనంత వరకు కక్షి దారులు కేసులు పరిష్కరించుకోవాలని ఆమె వివరించారు. ఇంకా మరికొందరు మాట్లాడారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి లోక్ నాదం, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిదులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:**
ప్రజా పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జయచంద్ర, వెంకటేష్‌లు పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని సి.పి. ఎం కార్యాలయంలో రాజకీయ శిక్షణ తరగతులు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జయచంద్ర, వెంకటేష్‌లు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ దేశంలో ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ప్రజాసమస్యల పరిష్కారానికి అను నిత్యం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. పాలకవర్గాల తప్పుడు విధానాలను ప్రజలలో ఎండగడుతూ దేశంలో బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించాలని పోరాడుతున్నామని తెలిపారు. పెరిగిన ధరలను నియంత్రించాలని సామాన్యులకు అందుబాటులో నిత్యవసర సరుకుల ధరలు ఉండేల చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ శ్రేణులను మరింత ప్రజా ఉద్యమాలలో ప్రజలకు అండగా ఉండేందుకు కార్యకర్తల్లో చైతన్యం నింపేందుకు ఈ రాజకీయ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఈ సమావేశంలో గూడూరు సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయు పట్టణ కార్యదర్శి సురేష్, సీపీఎం సీనియర్ నాయకులు వెంకటరామి రెడ్డి, అడపాల ప్రసాద్, చంద్రయ్య, గుర్రం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



## పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి అన్నారు. శనివారం 0-18 సంవత్సరాల పిల్లల్లో వచ్చే నాలుగు రకాల లోపాలపై ఈనెల 27 నుంచి మూడు రోజుల శిక్షణను శనివారంతో ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించుట, పిల్లలకు తల నుంచి పాదం వరకు చేసే పరీక్ష విధానము అంగన్వాడీ పిల్లలకు, పాఠశాల పిల్లలకు, హై స్కూల్ కాలేజీ విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించాలన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలను, పోషకాహార పెరుగుదల లోపాలు, జన్యు పరమైన లోపాలు, వైకల్యాలు, వివిధ రకాల అంటువ్యాధులను గుర్తించి చికిత్స అందించుట ముఖ్య లక్ష్యంఅన్నారు. చికిత్స చేయలేని వారికి డిఈఐసి (డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు) రెఫర్ చేయుట విధానాలను శిక్షణ ఇస్తామన్నారు. జూలై మూడవ తేదీ జిల్లాలోని అందరూ డాక్టర్లు స్టాఫ్ నర్సులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్ఓ డాక్టర్ శ్రీనివాస్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మావతి ఆర్ బి ఎస్ కే, పీడియాట్రీషియన్ డాక్టర్ ప్రదీప్, డి ఈఐసి మేనేజర్, గుణశేఖర్ స్టాఫ్ పాల్గొన్నారు.



# మఠాలను ప్రక్షాళన చేయాలి : సాధు పరిషత్ డిమాండ్

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**
గోవింద నామ స్మరణలతో మారుమోగే తిరుమలలో మఠాలను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రక్షాళన చేయాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ శ్రీఆనందాశ్రమ పీఠాధిపతులు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ పీఠాధిపతులతో కలిసి ఆయన మాట్లాడారు. తిరుమలలోని మఠాల్లో మఠాధిపతులు మాత్రమే ఉండాలని, అటు కాకుండా మఠాల నిర్వాహకులు ముఠాలుగా ఏర్పడి తిరుమలకు వచ్చే భక్తులను నిలువునా దోచుకుంటున్నారని, పెళ్లిళ్ల పేరుతో తిరుమలలో భక్తుల నుండి స్వామివారికి చెందాల్సిన ధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మ్యారేజ్ కాంట్రాక్టర్స్‌గా అవతారం ఎత్తిన రాఘవేంద్ర, రామారావు అనే వ్యక్తులు మఠాలను అడ్డుపెట్టుకొని అందులో పెళ్లిళ్లు చేయిస్తూ కోట్లు వెనకేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తిరుమలతో ప్రక్షాళన చేస్తానని చెప్పి ఈఓను మార్చారని, ఒక్క ఈఓ మార్పుతో ప్రక్షాళన సాధ్యపడదని ఇంకా గత ప్రభుత్వ మత్తులో ఉన్న అధికారులను తొలగించి పూర్తిగా ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలలో నిబంధనలను అతిక్రమించి వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేసిన విశాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేయాలని, భక్తుల భద్రత దృష్ట్యా టిటిడి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ పీఠాధిపతులు, స్వాములు పాల్గొన్నారు.





## గ్రామ దేవత కోటమ్మ తల్లి అమ్మవారికి సారె తీసుకెళ్లిన ఆలయ ధర్మకర్త

**కోట, మేజర్ న్యూస్ :** తిరుపతి జిల్లా కోట గ్రామములోని గ్రామ దేవత కోటమ్మ తల్లి అమ్మవారికి రెండు రోజులపాటు జరిగే జాతర సందర్భంగా శనివారం సాయంత్రం నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, లక్ష్మీ కవితమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఇంటి వద్ద నుంచి మేళ తాళాలతో మహిళలు పూల బుట్టలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. మాజీ మంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోటమ్మ తల్లి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు మా అమ్మమ్మ ఊరైన కోటకు రావడం జరిగింది అన్నారు. గ్రామ దేవత కోటమ్మ తల్లి అమ్మవారిని దర్శించడం జరిగిందన్నారు. కోటలోనే పుట్టి పెరగడం జరిగిందన్నారు. కోటమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు, దీవెనలు వల్ల ఈ స్థాయిలో ఉన్నామన్నారు. పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త జగన్ మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించడం జరిగింది అన్నారు. దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి దీవెనలు ఆశీస్సులతోనే తాను,సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గెలుపొందడం జరిగిందన్నారు. కోట వాకాడు చిట్టమూరు మండలాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే విజయశ్రీని కలిసిన ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నివాసంలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి, వ్యవసాయ సిబ్బంది తిరుపతి జిల్లా డిపిఎం. ఆదేశాలు మేరకు నాయుడు పేట ఓజిలి పెళ్ళకురు మండలాల రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ. సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడు పేట, ఓజిలి, పెళ్ళకురు మండలాల రైతు సాధికార సంస్థ, ప్రకృతి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తా

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. తిరుమల, తిరుపతి రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేటు హోటల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ పాలనలో రేషన్ డీలర్లు పలు సమస్యల ఎదుర్కొన్నారని తెలిపారు. తిరుమల తిరుపతి రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానించిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు రేషన్ సక్రమంగా అందించాలన్నారు. రేషన్ డీలర్ల కమిషన్ పెంపు, డీలర్ కే లాగిన్ అవకాశం కల్పించే అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, గిరిబాబు, నాగరాజ శెట్టి, డిటీ సురేంద్ర, టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి నైనరు మహేష్ యాదవ్, జనసేన పట్టణ అధ్యక్షులు రాజా రెడ్డి, నాయకులు నగేష్, కెఎంకె లోకేష్, రాజేష్ ఆచారి, మునస్వామి, నగరంలోని రేషన్ డీలర్ల సభ్యులు, పాల్గొన్నారు.

## ఈవోను కలిసిన ఎమ్మెల్యే ఆరణి



టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె. శ్యామలరావును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలసి శుభకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం టిటిడి పరిపాలన భవనంలో మాజీ తుడా చైర్మన్ ఎన్వీ ప్రసాద్, అరణి శివ కుమా ర్‌తో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సన్మానించి మొక్క అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాలువలపై ఆక్రమణలు తొలగించండి

### - కమిషనర్ అదితిసింగ్

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** నగర పరిధిలోని కాలువలపై ఆక్రమణలను తొలగించి పూడిక తీసే పనులు వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని వివి మహల్ రోడ్డు, భవానీ నగర్, రైల్వే కాలనీ, సాయిరామ్ వీధి ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి కాలువలను పరిశీలించి శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వివి మహల్ రోడ్డుకు ఇరువైపుల వెలుతున్న ప్రధాన కాలువలపై ఆక్రమణలు తొలగించి, అటు తరువాత పూర్తి స్థాయిలో సిల్ట్ తొలగించి, ఎలాంటి ఆంటకాలు రాకుండా కాలువల్లోని మురికి నీరు ప్రవహించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. దేవేంద్ర థీయోటర్ ప్రక్కన వెలుతున్న ప్రధాన కాలువలో కేబుల్ వైర్లు, ఇతర పైప్ లైన్లు మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా వుండడం గమనించి, వాటినన్నింటిని క్రమబద్ధీకరించి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కాలువలపై ఆక్రమణలు నిర్మించుకోవడమే కాకుండ వ్యర్థాలను నేరుగా కాలువల్లోకి వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. కాలువల్లో పేరుకు పోయిన చెత్తను, ప్లాస్టిక్ బాటిల్లను తొలగిం చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొంచించాలన్నారు. కాలువల్లో వ్యర్ధలు వేయకుండా ప్రజలకి అవగాహన కల్పించాలని, ప్రతిరోజూ నిర్ణీత సమయాల్లో చెత్తను సేకరించేందుకు పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, పరిశుభ్రతకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డా.యువ అన్వేష్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ శ్రావణి, శానిటరి సూపర్‌వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.



## గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

### - జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలి
### - వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలి
### - టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** చిత్తూరు జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో వైకాపా ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని, ఈ కారణంగా అనేకమంది విద్యార్థులు యువత మత్తు పదార్ధాలకు బానిసలు అయ్యారని, యువత భవిష్యత్తు ఆ గమ్య గోచరంగా మారిందని ప్రధానంగా జిల్లాలో గంజాయి విక్రయం అధిక సంఖ్యలో జరుగుతున్నదని జిల్లాలో గంజాయి విక్రయాన్ని పూర్తిగా నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ద్వారా తెలియజేశామన్నారు. రా నన్ను వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని డయేరియా పై నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వైకాపా ప్రభుత్వం చేసిన అరాచకాలపై ప్రత్యేక విచారణ జరిపించాలని కోరడం జరిగిందని, ఎందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మాజీ ఎంపీపీ జయ చంద్ర నాయుడు, టిడిపి నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తెలుగుదేశం నాయకులు

## ఘనంగా నగర సంకీర్తన



**తిరుపతిఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తుల్లో మరింత భక్తి భావం పెంచుతూ తిరుపతి కీర్తి ప్రతిష్టలు పెరగడానికి నగర సంకీర్తన దోహదం చేస్తుం దని ప్రముఖ రంగస్థలం నటుడు మేకల గంగయ్య అన్నారు. నగరంలో భక్తి భా వం మరింత పెరగాలని ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రజలు నివసించాలన్న సంకల్పంతో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి నగర సంకీర్తన మండలి ఏర్పాటు చేశారు. నగరంలో ప్రతి శనివారం భజన మండలి కళాకారుల చేత సంకీర్తన గోష్టి నిర్వహిస్తు న్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం భజన మండలి కళాకారులు సాంప్రదాయ వస్త్రాలతో స్థానిక గోవిందరాజు స్వామి ఆలయం నుంచి నాలుగు మాడ వీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. నగర సంకీర్తన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు ఈ కార్యక్రమంలో క, జయమ్మ పద్మావతి, నిర్మల, పి పార్వతి, కే పద్మ, కే ఉమా, ఎం సుశీల, టి నిర్మల, జయలక్ష్మి, ముని కుమారి, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసు రెడ్డి, మునినాధారెడ్డి, కాస్ప పద్నాభం, చంద్ర బాబు నాయుడు, కొండె చెంగారెడ్డి, శంబూలో హరినాద్, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్వతి, పద్మ, ఉషారాణి, కల్పన, జయమ్మ, మునికుమారి, సుశీల, మహాలక్ష్మి, నరసింహారెడ్డి, నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, వాసు, సాయిరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### - కమిషనర్ డా. జె అరుణ



**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్:** నగర పాలక సంస్థ పరిధిలోని పింఛను లబ్ధిదారులకు జూలై 1వ తేదీ సోమవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వారి ఇంటి వద్దనే పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నగర కమిషనర్ డా. జె అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలోని 50 వార్డుల పరిధిలో పింఛన్ల పంపిణీకి సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నగర పరిధిలో మొత్తం 16,536 మందికి పెన్షన్ల పంపిణీ చేయడానికి 860 క్లస్టర్స్ ఏర్పాటు చేసి 350 మంది వార్డు కార్యదర్శులను మ్యాపింగ్ చేసినట్లు వివరించారు. మొత్తం 16,536 మందికి రూ.11,31,76,000 లను లబ్ధిదారుల ఇంటి వద్దనే అందించనున్నట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి సీఎం అండ...

### - ఏఇసీఇఏ జి 3045 యూనియన్ హర్షం



**తిరుపతి అర్బన్, మేజర్ న్యూస్:** కుప్పం పరిధిలోని 33 కెవి గుడ్ల నాయన పల్లి సబ్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న ముత్తుకుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందారని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఇసిఇఏ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మృతుడి భార్య, వాళ్ళ చిన్నారి పాపను సీఎం నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లి జరిగిన విషయాన్ని వివరించడం జరిగిందన్నారు. దీనికి స్పందించిన సీఎం వెంటనే మృతుడి భార్యకు విద్యుత్ శాఖలో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో పాటు చిన్నారి చదువుకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని ధైర్యం చెప్పారు.సీఎం గొప్ప మనసుకు తమ జి 3045 యూనియన్ లోని 25 వేల కార్మిక కుటుంబాల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఒక్క జూన్ మాసంలోనే ఎనిమిది ప్రమాదాలు 220, 132, 33 కెవి సబ్ స్టేషన్‌లలో విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో కార్మికులు మరణించడం బాధాకరమన్నారు. రోడ్డున పడ్డ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశామన్నారు.

## పోలీస్ శాఖకు మీ సేవలో మరువలేనివి

**- సమాజ సేవకు మీ పిల్లలను పోలీస్ శాఖకు పంపండి**
**- పదవీ విరమణ పొందిన అధికారుల సన్మాన సభలో జిల్లా ఎస్పీ**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** సమాజ సేవ కోసం పోలీస్ శాఖకు కృషి చేసిన మీ సేవలు మరువలేనివిఅని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. పదవి విరమణ పొందిన అధికారుల సన్మాన సభ శనివారం పోలీస్ అతిథి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు ఇన్నాళ్ళు మీరు చేసిన సేవలు అమోగంఅని అందరు తమకు ఇచ్చిన విధులను అంకితభావంతో నిర్వహించారని కొనియాడారు. పదవి విరమణ పొందిన పోలీసులకు జీవితంలో ఉద్యోగం, పదవి విరమణ సాదారణమని చెప్పారు. పదవి విరమణ పొందిన అధికారులు ఆకరి రోజు కూడా తన ఉద్యోగ ధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వహించడం ఒక్క పోలీస్ కే సాధ్యమన్నారు. ఉద్యోగ విషయంలో పోలీస్ వ్యవస్థకు సేవలు అందించిన మీకు ఈ డిపార్టుమెంటు తప్పకుండా రుణపడి వుంటుందన్నారు. సమాజ సేవకు మీ పిల్లలను పోలీసు శాఖకు పంపాలని కోరారు. ముఖ్యంగా పిల్లలు తమ తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తించి వారి ఆశయాలను మీ ఆశయాలుగా చేసుకుని వారి కళ్ళల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో బాధ్యతగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజ్ఞప్తి చేశారు. రేపటినుండి మీరందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా మీ శేష జీవితాన్ని గడపాలన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను పదవి విరమణ తర్వాత బాగా చూసుకోవాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆకాంక్షించారు. అనంతరం పదవి విరమణ పొందిన ఏవో ఐ కిషోర్ కుమార్, ఎస్ఐ కృష్ణమూర్తి, ఏఎస్ఐలు మహమ్మద్ సాహెబ్, వి మణి, కే సుబ్రహ్మణ్యం, కె.వి.రామరాజు, ఏ ఆర్ ఎస్ ఐ జి నరసింహులనాయుడు, హెడ్ కానిస్టేబుల్ రాజువేలు వారి కుటుంబ సభ్యుల సమీక్షంలో జిల్లా ఎస్పీ ఘనంగా సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు పరిపాలన, విమల కుమారి నేర విభాగం, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారులు సంఘం సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవోకు పీఈడబ్ల్యూఏ నేతలు శుభాకాంక్షలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం నూతన ఈవో జే శ్యామలరావుకు పీఈడబ్ల్యూఏ ఏపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో పీఈడబ్ల్యూఏ ఏపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పరందామయ్య, రాష్ట్ర కార్యదర్శులు నాగేశ్వర రావు, శ్రీనివాసరావు, మహిళా విభాగం కార్యదర్శి సునీత, ఏలూరు జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ఎస్‌హెచ్ఏఆర్ ఉద్యోగులు ఎ.వెంకటేశ్వర్లు, వీరబద్రం, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, గుణ సాయి, మస్తాన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



## శ్రీవారిని సేవలో పలువురు ప్రముఖులు



**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో టీడీపీ ఎమ్మెల్యే కళా వెంకటరావు., భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల ఎమ్మెల్యే కళా వెంకట రావు మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ఏర్పాటైందని అన్నారు. అభివృద్ధి, సంక్షేపం కోసం ఆ భగవంతుడు చంద్రబాబు నాయుడుని ఆ భగవంతుడు గెలిపించారన్నారు. అభివృద్ధిలో నంబర్ 1 గా ఉండేలా కృషి చేస్తారని ఆయనకు ఆ శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లా శ్రీనివాసరావు శుభాకాంక్షలు



**తిరుపతికల్చరల్, మేజర్‌న్యూస్:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీమంత్రి, ప్రస్తుత శాసన మండలి సభ్యులు సి.రామచంద్రయ్య మరియు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అభివృద్ధి మాజీ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బోయకొండ గంగమ్మ హుండీ ఆదాయం రూ.1.16 కోట్లు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం లో శనివారం జరిగిన హుండీ లెక్కింపు నందు దేవస్థానం ఆదాయం అరవై ఐదు రోజులకు గాను ఒక కోటి పదహారు లక్షలా



ఇరవై ఒక్కవెయ్యి ఏడువందలా ఇరవై మూడు రూపాయలు నగదు వచ్చినది.బంగారు 60 గ్రాములు,ఒక కేజి రెండువందల ఇరవై గ్రాముల వెండి,యూ.యస్ ఐదు డాలర్లు ఒక నోటు, యూ.యస్. ఒక డాలర్ నోట్లు నాలుగు,ఓమన్ వంద బాసియా మూడు నోట్లు, మలేషియా రింగిట్ ఒకటి,ఆర్.యం. మూడు నోట్లు,ట్రినిడాడ్ మరియు టోబాగో ఇరవై డాలర్లు నోటు ఒకటి,ట్రినిడాడ్, టోబాగో పది డాలర్లు ఒక నోటు,ట్రినిడాడ్ మరియు టోబాగో ఒక డాలర్ నోట్లు ఆరు వచ్చాయని, రణబేరి గంగమ్మ దేవస్థానం ఆదాయం డెబ్బై ఎనిమిది వేలా ఎనిమిది వందలా ఇరవై తొమ్మిది రూపాయలు వచ్చిందని సదరు హుండీ లెక్కింపునకు దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి చంద్రమౌళి,ఆలయ ప్రధాన అర్చకులు,గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి వై.మునిరాజ,చౌడేపల్లి పోలీస్ సిబ్బంది, దిగువపల్లి గ్రామ రెవిన్యూ అధికారి రాజన్న, ఐసిఐసిఐ బ్యాంకు దిగువపల్లి సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీ ఉద్యోగులకు ఘన సన్మానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** టీటీడీలో వివిధ విభాగాలలో ఉద్యోగ సేవలు అందించి శనివారం పదవీ విరమణ చేస్తున్న టీటీడీ ఉద్యోగులను తితిదే ఎంప్లాయిస్ బ్యాంకు ఉపాధ్యక్షులు, తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సునీల్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, అసోసియేట్ ప్రెసిడెంట్ మణికంఠ పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆధునిక బోధనోపకరణ వినియోగంపై పుత్తూరు సమీపంలో ఉన్న వెంకట పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శనివారం శిక్షణ ఇచ్చామని ప్రధానోపాధ్యాయులు సిద్దయ్య తెలిపారు. గ్రూప్ లీడర్ కామసాని చంద్ర వనిత ఆధ్వర్యంలో విద్యార్థులకు టెక్నాలజీతో పాటు పర్యావరణ పై అవగాహన కల్పించడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఈ సి ఈ విద్యార్థులు సామాజిక సేవ ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు .సాంకేతిక విద్య,, మొక్కలు నాటడం కార్యక్రమంలోభాగమని చెప్పారు.కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## వన వేణుగోపాల స్వామికి క్షీరాభిషేకం


ప్రత్యేక అలంకరణలో వన వేణుగోపాలస్వామి

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని దేవర గుడిపల్లి-ఆడారెడ్డిపల్లి గ్రామ సమీపంలో వెలసి ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం విశేష పూజలు చేశారు. స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. తదుపరి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు వన వేణుగోపాల స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యనిర్వాకులు పాలాభిషేకం చేసిన భక్తులకు అభిషేకం చేసిన పాలును తీర్థముగా ఇవ్వడంతో భక్తులు తమ ఇళ్లకు భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లారు. కార్యనిర్వహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కుప్పం అర్బన్ సిఐను సన్మానించిన వైసీపీ నాయకులు

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన సిఐ జీటి.నాయుడునీ వైసిపి నాయకులు శనివారం గౌరవపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ కి వైసిపి సీనియర్ నాయకులు పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించాడు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ , వైస్ చైర్మన్ హఫీజ్ ,మరియు వార్డ్ కౌన్సిలర్లు గణపతి, రంగన్న, సయ్యద్ అలీ, రాజ్ కుమార్, విజయ్, ఎం ఆర్ సురేష్, అరవింద్, సోము, మునిరాజు, మోహన్ రాం, కో ఆప్షన్ సర్దార్ భాషా, ఆంజనేయస్వామి గుడి చైర్మన్ కుమరేషన్, టౌన్ బ్యాంక్ చైర్మన్ భాగ్యరాజ్, సర్పంచ్ గిరి, దేవా తదితరులు పాల్గొన్నారు.



## నేడు కార్వేటినగరానికి ముగ్గురు ఎమ్మెల్యేలు రాక



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయ ఆవరణలో విజయోత్సవ సభ నిర్వహించడం జరుగుతుందని గంగాధర నెల్లూరు నియోజకవర్గం జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు యుగంధర్ తెలిపారు. గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ థామస్, చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు చిత్తూరు ఎమ్మెల్యే గుజరాల జగన్మోహన్, తిరుపతి శాసన సభ్యులు శ్రీనివాసులు వీరికి సన్మాన సభ నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండ లంలోని శంకర్రాయలపేట లోన గల మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సీజ నల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పెద్దపంజాణి మండల వైద్యాధి కారి డాక్టర్ మురళి డయేరియా (విరోచనాలు),దోమలు, ఈగలు వల్ల వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.



# లోక్ అదాలత్‌లో తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం

**- సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ ఉపయోగించుకోండి**

**- 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం శ్రీకాళహస్తి పట్టణం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంనకు 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ధర్మారావు. వివిధ శాఖల ఉన్నతా ధికారులు, బ్యాంక్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలతో ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం అన్నారు. దీనికి తిరిగి అప్పీల్ లేదని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్ష దారులు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కోర్టులో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల రాజీపడని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, లేబర్ కేసులు, సివిల్ కేసులు, కోర్టు వరకు వెళ్లని రాజీ పడదగిన తగాదాలు లోక్ అదాలత్‌తో పరిష్కరించుకోవచ్చు. లోక్ అదాలత్ అవార్డు అప్పీలు లేని అంతిమ తీర్పు అని తెలిపారు.


లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకాళహస్తి జడ్జిలు

# ఆర్టీసీలో పదవీ విరమణ ఉద్యోగులకు ఘన సన్మానం

**తిరుపతి(అర్బన్), మేజర్‌న్యూస్:** తిరుపతి ప్రజా రవాణా విభాగంలో వివిధ హోదాలలో పని చేస్తూ శనివారం నలుగురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారిని సన్మానించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చంగల్రెడ్డి విచ్చేసి,వారిని దృశ్యాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ చేసిన వారిలో రమేష్ (అసిస్టెంట్ మేనేజర్ ఫైనాన్స్), పిసి.బాబు (సూపరింటెండెంట్ పర్సనల్), బి.కృష్ణారెడ్డి (ఆర్ఎం కార్యాలయ పిఆర్ఓ), బి.మని (టిటిఐ) ఉన్నారు. వీరికితోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇన్నేళ్లు విధి నిర్వహణలో తమతో పాటు ఉండి,నేడు తమ నుంచి వేరు అవుతున్నారనే సంఘటన తలచుకుని కార్యక్రమం జరిగే ప్రాంతమంతా ఉద్యోగులు భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ జి. నరసింహులు, ఇతర అధికారులు, అలాగే పెద్ద సంఖ్యలో సహచర ఉద్యోగులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



# మళ్లీ ఇంటికే సామజిక పింఛన్లు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రానున్న మాసంలో ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే మళ్ళీ ఇంటివద్దకే సామజిక భద్రతా పింఛన్ నగదు పింఛన్ దారులకు అందుతాయని ఎంపిడిఓ అన్నపూర్ణ రావు తెలిపారు. మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు నేటి దినపత్రిక సూర్యతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ జరుగుతుందని,ప్రతి ఉద్యోగి 50 పింఛన్లు పంపిణి చేసేలా సర్దుబాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు క్లస్టర్ విధానం అనుసరించాలన్నారు. ప్రతి క్లస్టర్‌కు సిబ్బందిని పక్కాగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, తదితర సిబ్బందిని వినియోగించాలని ఆదేశించారు.ఎన్టీఆర్ భరోసా పేరుతో పెన్షన్ నగదు ను రూ 4000కి పెంచడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో నెల రూ. వెయ్యి చొప్పున మూడు నెలలకు రూ. 3000, జులై పింఛను రూ. 4000 కలిపి పింఛనుదారులకు రూ. 7000 పంపిణీ చేయడం జరుగుతుందని వారు అన్నారు.అదేవిదంగా మండలంలోని మొత్తం 5347 పెన్షన్ లు ఉన్నాయని, పింఛన్ దారులకు అందించే మొత్తం నగదు 3 కోట్ల 67 లక్షల 33 వేల రూపాయలని వారు తెలిపారు.పెన్షన్ లో భాగంగా వృధాప్య పెన్షన్ 2952,అభయహస్తం 38,చేనేత కార్మికులు 48, వికలాంగులు 669,వితంతువులు 1447,కల్లు గీత కార్మికులు 23, మత్యాకారులు 7, ఒంటరి మహిళలు 93 చెప్పులు కుట్టేవాళ్లు 6, డప్పు కళాకారులు 20,డైయాలసిస్ 10, పేరాలసిస్ 39 మంది ఉన్నారని వారు పేర్కొన్నారు.



# విద్యుత్ తీగ తగిలి వ్యక్తికి గాయాలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆర్ కేవిబి పేట అరుంధతి వాడలో ఎన్ఆర్ కండిగ నుంచి కూలి పని చేయుటకు లోకనాథం ఇంటి తాపీ పని నిమిత్తం రాజేంద్ర పనిచేస్తుండగా విద్యుత్తు లైను కింది భాగంలో ఉండడంతో విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన తర్వాత విద్యుత్ స్తంభం మార్చుకొనుటకు ప్రభుత్వ చలానా కట్టాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. విద్యుత్ తీగ తలకు బలంగా తగలడంతో షాక్‌కు గురైన పరిస్థితి. అంతలో గ్రామ ప్రజలు గాయపడిన అతని చికిత్స కోసం కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వైద్య సేవలను అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తిరుపతి తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ పైన తెలుగు దేశం పార్టీ నాయకులు విద్యుత్ శాఖ ఏడిఈ నాగరాజుకు ఫిర్యాదు చేశారు.


ప్రమాదంపై ఏడీకి ఫిర్యాదు చేసూత్తున్న టీడీపీ నేత

## కళాకారుల సంక్షేమభివృద్ధికి కృషి అభినందనీయం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో వాయిద్య కళాకారులు సంక్షేమానికి, ఐక్యతకు తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర కోటి సదాశివం చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు– 2022 గ్రహీత వినుకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం రుద్రకోటి సదాశివం స్వగృహానికి విచ్చేసి ఆయనకు శాలువతో సన్మానించి శ్రీవారి చిత్రపటాన్ని బహుకరించి ప్రశంసించారు. ఈసందర్భంగా రుద్రకోటి సదాశివం, వినుకొండ సుబ్రహ్మణ్యం లు భవిష్యత్తులో కళాకారుల అభ్యున్నతికి చేయాల్సిన కృషి పై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు వాయిద్య కళాకారులు కూడా పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్‌ను సందర్శించిన - బొజ్జల రిషిత రెడ్డి



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** పట్టణంలోని బిసి హాస్టల్‌ను సందర్శించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ విద్యార్థులను అడిగి వారి యొక్క సమస్యలను తెలుసుకున్నారు. పిల్లలు మాట్లాడుతూ హాస్టల్లో ఫ్యాన్లు లైట్లు, మరుగుదొడ్లు కనీస సౌకర్యాలు, లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రిషిత రెడ్డికి అర్జీ ద్వారా తెలిపారు. అనంతరం బొజ్జల రిషిత రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సరిగ్గా నేటి నుండి ఒకటిన్నర నెల లోపల హాస్టల్ యొక్క సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తానని పిల్లలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్పనాదం, కన్నన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఎంప్లాయబిలిటీ సదస్సు



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో నిర్వహించిన ఎంప్లాయబిలిటీ స్కిల్స్ సదస్సు శనివారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ అఫ్ స్కిల్ డెవలప్మెంట్, ప్రొఫెసర్ విద్యావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు తమ అధ్యయన రంగానికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులను ప్రశంసిస్తూ వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం.ఉషారాణి, విభాగాధిపతి పాల్గొన్నారు.

## వెంకటసుబ్బయ్య సేవలు ప్రశంసనీయం



**వాకాడు మేజర్‌న్యూస్:** మండలంలోని దుగ్గరాజ పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం. ఉపాధ్యాయుడిగా పని చేస్తూ శనివారం పదవీ విరమణ చేసిన ముమ్మడి వెంకటసుబ్బయ్య సేవలు ప్రశంసనీయమని మండల విద్యాశాఖాధికారి నసీం అలీ అన్నారు. వెంకటసుబ్బయ్య' ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో సన్మాన సభను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దడంతోపాటు ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడంలో వెంకటసుబ్బయ్య కృషి ఎంతో ఉందని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. అనంతరం వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యుల దాతృత్వంతో పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. వెంకటసుబ్బయ్య, గిరిజమ్మ దంపతులను పలువురు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బంధువులు శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోట, చిట్టమూరు ఎంఈఓలు మస్తానయ్య, బివి కృష్ణయ్య, హెచ్ఎంలు వెంకయ్య, పి ప్రవీణ్ కుమార్, నాగయ్య, 'భూపయ్య, నాగమణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ : కమిషనర్



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకముగా చేపడుతున్న ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ కార్యక్రమం ఇంటింటికి సచివాలయ సిబ్బందిచే పెన్షన్ పంపిణి కార్యక్రమం నిర్వహించబడుతుందని కమిషనరు ఎం. రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భముగా మునిసిపల్ కమిషనరు ఎం. రమేష్ బాబు పింఛను పంపిణీ సిబ్బందిచే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచలను జారీ చేయడమైనది. సచివాలయం సిబ్బంది ఇంటింటికి వచ్చి నెలవారీ పెన్షన్ 4,000 ఏప్రిల్, మే, జూన్ నెల బకాయిల 3,000 మొత్తం 7,000 లు పింఛను చెల్లించబడునని ఒక ప్రకటనలో తెలియజేశారు. పింఛను పంపిణీ కార్యక్రమంను నోడల్ ఆఫీసర్స్ పర్యవేక్షించడం జరుగుతుందని తెలియజేశారు.

# విద్యార్థులు బాగా చదువుకుని మంచి పేరు తీసుకురావాలి

### ఎమ్మెల్యే బొజ్జల సతీమణి బొజ్జల రిషితా రెడ్డి



**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని గుండెలగుంట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాకానుక పథకం ద్వారా పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి విచ్చేసారు. వీరికి తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు అధ్వర్యంలో మహిళ లచే హారతులు పట్టి శాలవాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు బొజ్జల రిషితా రెడ్డి విద్యాకానుక పథకం ద్వారా బ్యాగులు, బుక్కులు, ఎకరూప దుస్తులు అందించారు. అనంతరం బొజ్జల రిషితా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువు కోని తల్లిదండ్రులకు పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు పోవాడానికి చంద్రన్న ప్రభుత్వం సహాయ సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. గుండెలుగుంట పాఠశాలకు అనుబంధంగా వసతిగృహం నిర్మించి చుట్టుపక్కల గ్రామాలలోని విద్యార్థులకు అందుబాటులో తీసుకొని రావడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అయినా బాత్రుములు, తాగునీటి కుళాయిలు, బోరు మోటారు, స్టేజ్ మీద శ్లాబ్ నిర్మాణం, ప్లే గ్రౌండ్, స్కూల్ వద్ద బస్సు షెల్టర్ నిర్మాణం తొందరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు, అలాగే బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. అన్ని సదుపాయాలు కల్పించిన తరువాత పాఠశాలని దత్తత తీసుకొని నియోజకవర్గం లోనే కాకుండా జిల్లాలో ఉత్తమ పాఠశాల లాగా నిలిపేలా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు మాట్లాడుతూ గతంలో స్వర్గీయ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో మండలంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తు పాఠశాల నిర్మించడం జరిగిందని తెలిపారు. గుండెలుగుంట పాఠశాల కుడత గోపాలన్న చొరవతో నిర్మించడం జరిగిందని అన్నారు. అయితే గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా పాఠశాలలో ఎటువంటి అభివృద్ధి జరగకుండా ఉండడం చాలా భాధాకరం అని అన్నారు. స్కూల్ కు కావాల్సిన అన్ని మౌలిక వసతుల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ద్వారా కల్పించడం జరుగుతుందని అన్నారు.

# విద్యార్థుల నమోదు పెంచాలి : డిఇఓ

**గూడూరు, మేజర్‌న్యూస్:** పాఠశాలల్లోజి విద్యార్థుల నమోదును పెంచేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ వి శేఖర్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. శనివారం చిల్లకూరు మండలం పరిధిలోని పాలి చేర్లవారి పాలెం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 7668 మంది ఉపాధ్యాయులు ఉన్నారని వారంతా ఒక్కొక్కరిని చేర్పించినా 300 ఉపాధ్యాయ ఉద్యోగాలు కొత్తగా వస్తాయన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఐఎఫ్ఎల్ పి ప్యానల్ లను ఉపయోగించాలని, బైజూస్ టాబ్లలను సక్రమంగా వినియోగించులన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయడంతోపాటు 6వ తరగతి నుంచి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నింటిని విద్యార్థులకు అదేవిధంగా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనంను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంకా డిఇఓ వెంట మండల విద్యాశాఖధికారులు వి సంపత్ కుమార్, ఎండి రావూఫ్‌తో పాటు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుని వై చంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.



# పోగొట్టుకున్న పర్సును సిమ్స్ సెక్యూరిటీ అందజేత

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** స్విమ్స్ ఆసుపత్రిలో పోగొట్టుకున్న పర్సును సెక్యూరిటీ పేషెంట్ కు అందజేశారు. ఈనెల 27 జిల్లా దొరవారిసత్రం మండలం పొలెంపాడు గ్రామానికి చెందిన ఎస్ కోటేశ్వరరావు స్విమ్స్ హాస్పిటల్లో తన హ్యాండ్ బ్యాగ్ పర్సును పోగొట్టుకున్నారు. అదే రోజు సాయంత్రం అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది శివ కృష్ణ పర్సనల్ గుర్తించారు. అక్కడ ఉన్న పేషెంట్లను వాకబ్ చేయగా ఎవరు స్పందించలేదు. ఆ పర్సును తనిఖీ చేయగా అందులో 10వేలు నగదు, 4 ఏటీఎం కార్డులు, గోల్డ్ లోన్ కు చెందిన బ్యాంకు రసీదులను గుర్తించారు. ఆ లోన్ రసీదు ద్వారా సూళ్ళురుపేట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ ను సంప్రదించి సదరు వ్యక్తి ఫోన్ నెంబర్ సేకరించి సమాచారం అందించి పేషెంట్ సోదరుడు శనివారం స్విమ్స్ ఆసుపత్రికి పిలిపించి జారవిడుచుకున్న పర్సుతో పాటు నగదు 10 వేలు, ఎటిఎం, గోల్డోన్ కార్డులను పేషెంట్ అంగీకారంతో శనివారం అందజేశారు. పర్సు అందుకున్న పేషెంటు తమ్ముడు రమణయ్య సిమ్స్ యాజమాన్యానికి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్విమ్స్ సెక్యూరిటీ ఇలాంగోవన్ రెడ్డి, శివకృష్ణను, సెక్యూరిటీ సిబ్బందిని స్విమ్స్ ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ అభినందించారు.



# రాజీయే ... రాజ మార్గం

### ప్రిన్సిపల్ సివిల్ న్యాయ మూర్తి సులోచనా రాణి

**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** చట్ట ప్రకారం రాజీ చేసుకోగలిగిన కేసులన్నింటినీ మెగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందని ప్రిన్సిపల్ సివిల్ న్యాయమూర్తి సులోచనా రాణి తెలిపారు. పట్టణంలోని కోర్టు భవన సముదాయ ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ జరిగింది. రెండో పట్టణ పరిధిలోని కోర్టు భవన సముదాయ ప్రాంగణంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ లో పలు కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి సులోచనా రాణి మాట్లాడుతూ..మెగా లోక్ అదాలత్ ద్వారా అనేక రకాల కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. తద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతోందని తెలిపారు. ఇది గుర్తించి లోక్ అదాలత్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వీలైనంత వరకు కక్షి దారులు కేసులు పరిష్కరించుకోవాలని ఆమె వివరించారు. ఇంకా మరికొందరు మాట్లాడారు.ఈ లోక్ అదాలత్ లో న్యాయమూర్తి లోక్ నాదం, న్యాయ వాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతిని టెంపుల్ సిటీగా ప్రకటించాలి

## ప్రముఖ సినీ నటుడు సుమన్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా ఆలయాలతో విరాజిల్లుతున్న తిరుపతి టెంపుల్ సిటీగా ప్రకటించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీ నటుడు సుమన్ తెలిపారు. శనివారం గోవిందరాజస్వామి వారిని నటుడు సుమన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం వారికి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అత్యంత అద్భుతమైన ప్రాచీనమైన ఆలయం గోవిందరాజస్వామి ఆలయమని, స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం మహద్భాగ్యమన్నారు. స్వామివారి దర్శనంతో పాటు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని, పేరూరు వద్ద నున్న వకుళా మాత, కపిలేశ్వర స్వామి, శ్రీనివాస మంగాపురం ఆలయాన్ని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాను జీసెస్ క్రైస్తవ్ చిత్రంలో జీసెస్‌గా నటిస్తున్నానని ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం కన్నడ, మలయాంలో రూపొందుతోందని తెలిపారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంతో ఆశతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలకు మంచి చేయాలని కోరారు. అలాగే ఎంతో మంది యువత చదువుకొని ఉద్యోగాలు రాక ఇబ్బం దులు పడుతున్నారని వారికి ఉద్యోగ అవ కాశాలు కల్పించి వారి మంచి భవిషత్ కు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గత వైసిపి పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగు దేశం పార్టీ హయాంలో రాజధాని పోలవరం నిర్మాణంతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. అలాగే జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ప్రజల సమస్యలు తెలుసని, ఆదర్శగా ఆయన పాలన అందించి రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రజలకు సుపరిచిత పాలన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్చూరు నారాయణ గౌడ్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### దళారీ వ్యవస్థ నియంత్రణకు

# ఆన్లైన్ ఆధార్ అనుసంధానం

## అధికారుల సమీక్షలో ఈఓ జె.శ్యామలరావు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న ఆన్లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు వీలవుతుందని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు చెప్పారు. టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో శనివారం యుఐడిఎఐ (ఆధార్ సంస్థ) నుండి విచ్చేసిన అధికారులు, టిసిఎస్ జియో, టీటీడీ ఐటి విభాగంతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ఇదివరకే టీటీడీ దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారిసేవ తదితర సేవలను ఆన్లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. అయితే ఈఅప్లికేషన్ల ద్వారా కూడా దళారుల బెడద తప్పడం లేదని, వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్‌చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఐటి అధికారులను ఈఓ ఆదేశించారు. ఇందుకు సంబంధించి యుఐడిఎఐ అధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆధార్ ద్వారా యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి, ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై ఆయన చర్చించారు. అంతకు ముందు యుఐడిఎఐ అధికారులు ఆధార్ ను ఏ విధంగా అప్లికేషన్‌లకు లింక్ చేయవచ్చు, తదితరాంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సమావేశంలో యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకృష్ణ, అనుకూర చౌదరి, సంజీవ్‌యాదవ్, టీటీడీ జేఈఓలు వీం బ్రహ్మం, గౌతమి, సివిఅండ్ఎస్ఓ నరసింహ కిషోర్, రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కలెక్టర్‌ను కలసిన ఎస్పీ మణికంఠ చందోలు

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న సగిలి షన్మోహన్ బదిలీ చేసింది. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా సుమిత్ కుమార్‌ను నియమించింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్ నందు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి నైనార్ శుభాకాంక్షలు



**తిరుపతి కల్చరల్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి, ప్రస్తుత శాసన మండలి సభ్యులు సి.రామచంద్రయ్య, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అభివృద్ధి మాజీ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డు నాణ్యత మరింత పెంచడానికి చర్యలు : టీటీడీ ఈఓ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవారి లడ్డు ప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డైరీ నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా కాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై, అందుకు తీసుకోవలసిన మార్పులను తెలియజేయాలని ఆయన నిపుణులను కోరారు. తరువాత ప్రముఖ డైరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ లడ్డు నాణ్యత పెంచేందుకు ఎస్ఎస్ఐ నిబంధనల ప్రకారం నాణ్యమైన నెయ్యిని ఎలా తయారు చేస్తున్నారు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. నాణ్యమైన నెయ్యి ప్రామాణిక విలువల గురించి వారు తమ పిపిటిలో తెలిపారు. త్వరలో లడ్డు నాణ్యత మరింత పెంచడానికి అవసరమైన నెయ్యి సమకూర్చుకోవడానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జెఈఓ గౌతమి, ఎస్వి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జిఎం మురళీకృష్ణ, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆమినిగుంట బస్టాండ్ సమీపం లో గ్రామానికి చెందిన పంపుసెట్ ట్రాన్స్ ఫార్మన్ వద్ద మేత మేస్తున్న పశువుకు కరెంట్ షాక్ కొట్టి శనివారం ఉదయం తొమ్మిది గంటలకు మరనించినది.ఐతే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు నాలు గడుగుల ఎత్తులో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడం, అక్కడే



పాడిపశువు గడ్డిని మేయడానికి వెళ్ళడం,పాడి ఆవుకు తగిలే అంత క్రిందనే ట్రాన్స్ ఫార్మర్ ఉండటం అనుకోకుండా పాడి ఆవుకు కరెంట్ షాక్ కొట్టి కళ్ళముందరే చనిపోయినదని పాడి ఆవు యజమాని బగిసి నాగమణి తెల్పారు.ఆవిడ మూడు పాడి ఆవులను మేపుకొని,పాలుపితికి ,పాలద్వారా వచ్చిన ఆదాయం తో జీవనము సాగించేదని ఆవిడ తెల్పారు.ఈ విషయం పైన విద్యుత్ శాఖ లైన్ మ్యాన్ కు,అసిస్టెంట్ ఇంజనీరు చౌడేపల్లి వారిని వివరణ అడుగుదామని మా ప్రతినిధి చరవాణి లో సంప్రదించగా ఎవరుకూడా స్పందించలేదు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఈ ఫోన్ కాల్‌తోనే తెలిసిపోయింది.

# చెంబేడులో వైభవంగా అగ్నిగుండం

**- మూడురోజుల నుండి పాండురంగ భజనలు**
**- అగ్నిగుండలో ప్రవేశించిన భక్తులు**
**- రంగ రంగా అంటూ వేడుకున్న భక్తులు**



**పెళ్లకూరు మేజర్‌న్యూస్ :** మండలంలోని మేజర్ పంచాయతీ ఐన చెంబేడు గ్రామం నందు 15 వ అనంద అగ్నిగుండ మహొత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.రుక్మిణి సమేత పాండురంగస్వామి వారి అనంద అగ్నిగుండ మహొత్సవ వేడుకల్లో భాగంగా మొదటి రోజు భక్తులు అందరూ సముద్ర స్నానం ఆచరించారు.మరుసటి రోజున శనివారం ఉదయాన్నే ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు.సాయంత్రం 9 మూరల అగ్నిగుండం త్రవ్వి అగ్నిగుండం వెలిగించారు.భజన గురువు సంక్రాంతి శీనయ్య దాస్ అగ్నిగుండంలో ప్రవేశించే వారికి కంకణం దారణ చేపట్టారు. పాండురంగస్వామి వారికి కలిశ పూజ ప్రారంభించి భజనలు ఆరంభం చేశారు.అక్కడ వేసిన భజనలలలో భాగంగా కోలాటము, పండరి భజన, జెండా వరుస,కృష్ణ లీలలు,పాండురంగస్వామి దండకం ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి.ఆదివారం తెల్లవారు జామున నరసింహ స్వామి దండకం ముగిసిన అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

## జగన్ ప్రతిపక్ష స్థాయిని కోరడం సిగ్గు చేటు - మదన్ మోహన్ నాయుడు

**శ్రీకాళహస్తి రూరల్ మేజర్‌న్యూస్:** ప్రజాక్షేత్రంలో కనీవినీ ఎరుగని రీతిలో ఘోర ఓటమిని మూటగట్టుకున్న వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్ష స్థాయిని కోరడం సిగ్గు చేటని టీడీపీ సీనియర్ నేత మదన్ మోహన్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది ప్రజాతీర్పును హేళన చేయడమే అవుతుందని మండిపడ్డారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా సీఎంగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డికి అసెంబ్లీ నియమావళి తెలియదా అంటూ



ప్రశ్నించారు. అసెంబ్లీ మొత్తం సభ్యుల్లో పదో వంతు ఉంటేనే ప్రతి పక్ష హోదా వస్తుందన్న కనీస పరిజ్ఞానం జగన్ కు లేకుండా పోవడం విడ్డూరమంటూ ఎద్దేవా చేశారు. ప్రజాసమస్యలపై మాట్లాడాలంటే ప్రతిపక్ష నేతే కావాల్సిన అక్కర్లేదని తెలిపారు. అధికారం, ప్రతిపక్ష హోదానో లేకపోతే జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి రారా అంటూ విమర్శించారు. నేడు వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలే దక్కాయనీ, జగన్ తీరు మారకుంటే పార్టీ భూ స్థాపితం కావడం ఖాయమంటూ హెచ్చరించారు.